మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



## ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు



**- ప్రత్యేక హోమా, పూజా కార్యక్రమాలు...**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జనవరి31 ప్రభాతవార్త:**అధికారిక ఎమ్మెల్యే ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక హోమం, పూజలు, వేద పండితలు మంత్రోత్సవంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వాదంతో నాగర్‌కర్నూల్ నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని నియోజకవర్గ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని ఈ ప్రజా భవన్ నుంచి ప్రజలకు సుపరిపాలన అందించాలని వేద పండితులు ఎమ్మెల్యే కు దీవెనలు అందించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పూజా కార్యక్రా మానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ నియోజకవర్గం నుంచి వచ్చినటువంటి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సరితలకు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ప్రత్యేక పూజా, హోమ కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు

## ఇటుక బట్టీలతో ఇక్కట్లు..!

**పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఇటుక బట్టీలు**
**మామూళ్ల మత్తులో వివిధ శాఖల అధికారులు**
**కోట్లకు పడగలెత్తుతున్న ఇటుక బట్టీ యజమానులు**
**కొందరికి మామూలు మరికొందరికి బెదిరింపులు**
**పేటలో కొనసాగుతున్న ఇటుక బట్టీల నిర్వాకం**



పట్టణంలో వెలసిన ఇటుక బట్టీలు

**నారాయణపేట ప్రతినిధి,జనవరి31 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో యదేచ్ఛగా రహదారికి ఇరువైపులా పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు రోజు రోజుకు వెలుస్తున్నాయి. పర్యావరణ చట్టాలను అమాను షంగా ఉల్లంఘిస్తూ ఇటుక బట్టీల పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. వాల్టా చట్టానికి కొందరు తూట్లు పొడుస్తూ యదేచ్ఛగా అటవి సంపాదన కొల్లగొడుతున్నారు. రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయానికి అతి సమీపంలో కూడా అనేక ఇటుక బట్టీలు ఉన్నాయి. పచ్చని చెట్లను నరికి కలపను అక్రమంగా ఇటుక బట్టీలకు వాడుతున్న వాల్టా చట్టానికి తూట్ల పొడుతున్న సంబంధిత ఫారెస్టు శాఖ అధికారులు చూసి చూడనట్లు మామూళ్ల మత్తులో తూగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణలు ఇటుక బట్టీలు అని చెప్పుకోవచ్చు. ప్రభుత్వ భూములలో చెరువులలో, ఊటకుంటలలో అక్రమంగా ఒండ్రు మట్టిని తవ్వి ఇటుక బట్టీల దగ్గర వేలకొద్ది టిప్పర్ల మట్టిని నిల్వచేస్తూ ఖనిజ సంపదను దోచుకుంటున్నారు. అయినా సంబంధిత రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు అటువైపు చూడడం లేదు. ఇటుక బట్టీలకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మూడు పువ్వులు ఆరు కాయలుగా వారి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని దీనికి గతంలోఉన్న అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల అండదండలు ఉన్నాయని పలువురు అంటున్నారు. ఇటుక బట్టీలు రోడ్డుకు ఇరువైపులా ఉండడంతో రాత్రి, పగలు అని తేడా లేకుండా వాటినుంచి వచ్చే దుమ్ము, ధూళి, పొగవల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతకొన్ని రోజుల క్రితం ఓ ఇటుక బట్టి సమీపంలో భారీ పొగ రావడం, దుమ్ము,ధూళి రావడంతో ఒక వ్యక్తి బైక్‌పై నుంచి పడి గాయాలపాలైనట్లు కొందరు తెలిపారు. వాల్టా చట్టం ప్రకారం నీరు,చెట్టు, భూమికి ఎలాంటి హాని జరగకూడదు. కాని అవి ఏవి నారాయణపేటలో చెల్లవు. ఇటుక బట్టీలు నిర్వహించాలంటే అనుమతులు తప్పనిసరి వాస్తవానికి నిబంధనల ప్రకారం ఏజెన్సీల్లో అటవి ప్రాంతాల్లో ఇటుక బట్టీలు నిర్వహించకూడదు. ప్రస్తుతం వేసవికాలంలో ఇటుకలకు మంచి డిమాండ్ ఉండడంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని, ఎక్కువ ఆదాయం సంపాదించాలని పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు పుట్టుకు వస్తున్నాయి. ఏదేమైనా చట్టానికి లోబడి ఉండాల్సిన ఇటుక బట్టీలు చట్టాన్ని అతిక్రమించి అనుమతులు లేకుండా నడుస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఇటుక బట్టీలు నిర్వహణ ద్వారా కొందరు యజమానులు కోట్లకు పడగలెత్తుతున్నారని ఆయా శాఖల అధికారులకు నెలా నెలా మామూళ్లు అందుతుండడంతో వారు ఆడింది ఆట పాడింది పాటగా ఇటుక బట్టీలు నడుస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని రోజుల క్రితం కొందరికి ఇటుక బట్టీల గురించి ఎలాంటి పత్రికలలో రాయకుండా ఉండటం కొరకు కొంతమేర ముట్టజెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వం ఏర్పడడంతో వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పర్యావరణాన్ని రక్షించాల్సిన అధికారులు ఇకనైనా ఇటుక బట్టీలపై చర్యలు తీసుకుంటారా లేదా వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పట్టణంలో వెలసిన ఇటుక బట్టీలు

## నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభివృద్ధే నా ధ్యేయం..

**- ప్రజలు పార్లమెంట్‌కు పోటీ చేయమని కోరుతున్నారు.**
**- అవసరమైతే ఢిల్లీ అధికార ప్రతినిధికి రాజీనామా చేస్తా...**
**- ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లు రవి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి,జనవరి31 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభివృద్ధే నా ధ్యేయమని, ప్రజలు పార్లమెంట్‌కు పోటీ చేయాలని కోరుతున్నారని, ప్రజల అభీష్టం మేరకు ఎంపీగా పోటీ చేస్తానని తెలంగాణ రాష్ట్రం తరుపున ఢిల్లీలో అధికార ప్రతినిధి మల్లురవి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఏనాడు నామినెటెడ్ పోస్టులు ఆశించలేదని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీలో లేకుండా ఉండలేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పోటీ చేసి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు బాటలు వేస్తుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాంతానికి పరిశ్రమలు రావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. గడిచిన ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పట్టం కట్టినట్లు పార్లమెంట్ స్థానాన్ని కూడా కాంగ్రెస్ గెలువాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, యువత, ఉపాధి కల్పనతో పాటు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ప్రాంతీయ పార్టీల వల్ల దేశానికి నష్టమని, ఇచ్చిన 6 గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన చేపడుతున్నారని కొనియాడారు. కల్వకుర్తి నియోజకవర్గానికి విచ్చేసిన మల్లురవికి కడ్తాల్, ఆమనగల్లు, వెల్దండ మండల కేంద్రాల్లో స్వాగతం పలికి సన్మానించారు. కల్వకుర్తి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మల్లురవిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కౌన్సిలర్లు ఏజాస్, హన్మనాయక్, కాంగ్రెస్ నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, జమ్ముల శ్రీకాంత్, రమాకాంత్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రతా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 31 ప్రభాతవార్త :** జిల్లాలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 2024 జనవరి 15వ తేదీ నుండి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ప్రజలకు తెలిసే విధంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. జిల్లా రవాణా శాఖ డిపార్టుమెంట్ వారి ద్వారా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్న వాల్ పోస్టర్‌ను, కరపత్రాలను జిల్లా ఎస్పీ గౌతమ్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధ వారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా రవాణాశాఖ డిపార్టుమెంట్ వారి ద్వారా నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాలపై జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిచోట, ప్రతి ప్రాంతంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. అలాగే రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు, వాహనదారులకు తెలియజేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో వాల్‌పోస్టర్ల ద్వారా కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్పీ వెంకటేశ్వర్‌రావు, మోటార్ వెహికల్ అధికారి మెగా గాంధి, వీరస్వామి, ఆర్ఐ శేఖర్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

## ఉమ్మడి పాలమూరు జిల్లాను కరువు జిల్లాగా మార్చారు..

**భారత్ జోడో న్యాయయాత్ర కృష్ణ మండలం నుండి ప్రారంభం.. హాజరైన ఎమ్మెల్యేలు**

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 31 ప్రభాతవార్త :** పాలమూరు జిల్లాను పదేళ్లుగా పాలకులు రాజకీయాలకు వాడుకుని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పాలకులు పాలమూరు జిల్లాను అభివృద్ధి పరంగా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కేవలం తమ రాజకీయ ప్రయోజనాలకు తప్ప జిల్లాను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. పాలమూరు న్యాయయాత్ర పేరుతో వంశీచందర్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించనున్న పాదయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా పడమటి ఆంజనేయస్వామి దేవాలయం, కృష్ణా మండలంలోని క్షీరలింగేశ్వరస్వామి దేవాలయాలలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఈ జిల్లా బిడ్డ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఘన విజయం సాధించాం. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీస్థానాలను గెలిపించుకున్నామని గుర్తు చేశారు. మన పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసుకునే అవకాశం మనం దక్కించుకున్నామన్నారు. రైతులకు, యువతకు, మహిళలకు, ఉద్యోగులకు అందరికి మేలు జరిగే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న ఉద్దేశంతో పాలమూరు న్యాయయాత్ర పేరుతో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యేల నేతృత్వంలో జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వంశీచందర్‌రెడ్డి చెప్పారు. రాహుల్‌గాంధి చేపట్టిన భారత్ జోడోయాత్ర స్ఫూర్తితో నిర్వహిస్తున్న పాలమూరు న్యాయయాత్ర ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు రోజులపాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. పాదయాత్ర సందర్భంగా అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ ప్రధాన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి దశల వారిగా చర్యలు చేపడతామని వంశీచందర్‌రెడ్డి చెప్పారు. నారాయణపేట జిల్లాలో సాగునీటి వనరులను కల్పించేందుకు నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం జరుగుతుందని, ఇందుకోసం ఇటీవలే ఎమ్మెల్యేలతో కలసి రాష్ట్ర మంత్రులు, అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ జిల్లా ప్రజలు శుభవార్త వింటారని వంశీచందర్‌రెడ్డి తెలిపారు. సంగంబండ రిజర్వాయర్ నిర్వాసితులకు అందాల్సిన పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వంశీచందర్‌రెడ్డి చెప్పారు.



పాదయాత్ర ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మీడియాతో మాట్లాడుతున్న వంశీచందర్‌రెడ్డి

అనంతరం వంశీచందర్‌రెడ్డి నిర్వహించనున్న పాదయాత్రను జడ్పీ చైర్మన్ వనజ ఆంజనేయులుగౌడ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, నాగరాజ్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, గవినోళ్ల గోపాల్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో మార్పుకోసం కృషి..!

**విద్యార్థులు ప్రతిరోజు వార్త పత్రికలు చదవాలి**
**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి**
**విద్యార్థులకు డిజిటల్ పుస్తకాల పంపిణీ**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 31 ప్రభాతవార్త :** విద్యా వ్యవస్థలో మంచి మార్పుల కోసం తాను కృషి చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సహకారం, తన సొంత నిధులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేపట్టిన విద్యా యాత్రలో భాగంగా బుధవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు డిజిటల్ కాంటెంట్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదుపాయాలు లేని కారణంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు వెనుకపడిపోవడం సబబు కాదన్న ఉద్దేశంతో వారు సైతం బాగా చదివి మంచి మార్కు సాధించేందుకు తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. విద్యలో మంచి మార్పుల కోసం ప్రభుత్వం సైతం సిద్ధంగా ఉందని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్‌ను రానున్న 40 రోజులు బాగా చదివి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాను విద్యకు ఇస్తున్న అత్యంత ప్రాధాన్యతలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను సందర్శించి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని, ప్రభుత్వం ఎన్‌జిఓల సహకారం, తన సొంత నిధులు, సిడిపి నిధుల ద్వారా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు న్యూస్‌పేపర్ చదవడాన్ని అలవాటు చేసుకోవాలని, అన్ని హాస్టళ్లకు వార్తా పత్రికలు వచ్చేలా చూడాలని, దీనిద్వారా మానసిక వికాసానికి చుట్టు ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. న్యూస్ పేపర్‌తో పాటు, బుక్కులు చదివే అలవాటు సైతం చేసుకోవాలన్నారు. తన నియోజకవర్గంల లైబ్రరీ లేని పాఠశాల ఉండకూడదన్న ఉద్దేశంతో వచ్చే అకాడమిక్ ఇయర్ నుండి ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు లక్ష రూపాయలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు సైతం పిల్లల్ని అప్పుడప్పుడు లైబ్రరీకి తీసుకువెళ్లాలన్నారు. రానున్న పది పదిహేను రోజుల్లో మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో కిచెన్‌షెడ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యలో మంచి మార్పు తేవడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసే ఆలోచనలో ఉందని, ఇదివరకే ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 10 పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో నైపుణ్యాల అభివృద్ధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, పరిశ్రమలు నెలకొల్పి ఇక్కడి యువతకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా విద్యాధికారి ఎ. రవిందర్, సమాచారశాఖ ఏడి యు.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఏఎంఓ శ్రీనివాస్, సిఎంఓ బాలుయాదవ్, మహబూబ్‌నగర్ ఎంఈఓ జయశ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిత్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



సమావేశానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..

**ఉప్పునుంతల,జనవరి31 ప్రభాతవార్త:**గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో నాబార్డు నిధుల కింద కోటి80లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సింగిల్ విండో కార్యాలయం) 800ల మెట్రిక్ టన్నుల కెపాసిటి కలిగిన గోదాం, అగ్రిమార్ట్, సంఘ కార్యాలయం, కామన్ సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అదే విధంగా సదగోడు, ఉప్పరిపల్లిలో గ్రామ పంచాయతీ భవనాలు, హెల్త్ సబ్ సెంటర్లు, ఉప్పరిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవం,ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి రోడ్డు పనులకు సదగోడులో 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం హెల్త్ సబ్ సెంటర్‌ను తాడూరులో 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, కొరటికల్ నుంచి షాండ్ క్వారీ రోడ్డు వరకు, వెల్టూరులో గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ, ఉప్పునుంతలలో సిసి రోడ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపుదలతో పాటు అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడం జరుగుతుందని అన్నారు. ప్రతిపక్షాలకు ఓపికలేక తీవ్ర విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ఇంకా అహంకారం పోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. ప్రజలు ఏ సమస్యలున్నా నేరుగా తన కలవచ్చున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొంది మొట్టమొదటిసారిగా మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి రావడంతో ఆయా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ తరపున ఘనంగా శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఎంపిపి అరుణ నరసింహారెడ్డి, ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు, జడ్పీటిసి ప్రతాప్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, వేముల నరసింహారావు, సర్పంచ్‌లు అనంత ఇంద్రసేనారెడ్డి, మల్లారెడ్డి, సరితా అనంతరెడ్డి, అలివేల, గోపిరెడ్డి రమేష్‌రెడ్డి, అనురాధ, నాగటి మల్లయ్య, రెడ్డి రెడ్డి రంగారెడ్డి, కొత్తపెద్ద జంగిరెడ్డి, సూరం నారాయణరెడ్డి, కొత్త చిన్నజింగిరెడ్డి, అంతిరెడ్డి, మేఘారెడ్డి, సదగోడు వెంకట్‌రెడ్డి, దాసర్లపల్లి నర్సింహారెడ్డి, తిప్పర్తి జగన్మోహన్‌రెడ్డి, సూరం ప్రశాంత్‌రెడ్డి (బిట్టు) సిహెచ్ శ్రీను, మద్ది తిరుపతయ్యగౌడ్ అన్ని గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

## ఎల్బీ స్టేడియానికి ఆర్టీసి బస్సులో స్టాఫ్ నర్సులు..

**జెండా ఊపి బస్సులను పంపించిన జిల్లా కలెక్టర్**

**గద్వాల ప్రతినిధి,జనవరి31 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లాలో ఎంపికైన 107 మంది స్టాఫ్ నర్సులకు నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న సందర్భంగా జిల్లా నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాఫ్‌నర్సులు బయలుదేరే బస్సును జెండా ఊపి జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, రెవెన్యూ కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారి డా.శశికళ ఆధ్వర్యంలో పంపించారు. ఈ సందర్భంగా జిల్లావైద్యారోగ్యశాఖ పరిధిలోమొత్తం 107మంది స్టాఫ్‌నర్సులను నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారని వీరందరికి బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేస్తున్నారని తెలిపారు.జిల్లా ఐడిఓసి కార్యాలయం నుండి ఉదయం 3ప్రత్యేక బస్సుల్లో స్టాఫ్‌నర్సులను అందరిని హైదరాబాద్‌కి తీసుకువెళ్లారని తెలిపారు. జిల్లా వైద్యాధికారి డా.శశికళ,ప్రోగ్రామ్ అధికారి డా.స్రవంతి సంబంధిత అధికారులు ఉన్నారు.



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

## సర్పంచులకు చరమగీతం...

**సర్పంచుల పగ్గాలు అధికారులకు బదిలీ...**
**నేటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన..**
**ఇప్పటికైనా పంచాయతీలో సమస్యలు పరిష్కారమయ్యేనా..**

**గోపాలపేట,జనవరి 31,ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ సర్పంచుల గడువు కాలం ముగియడంతో సర్పంచులకు చరమగీతం పాడుతూ నేటి నుండి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోకి మారబోతుంది.గతంలో 2018లో కూడా సుమారు ఐదు మాసాలకాలం పాటు ప్రత్యేకఅధికారుల పాలన కొనసాగింది.2019 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు దఫాలుగా పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో నిర్వహించింది.నేటికి ఐదేళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా,గ్రామపంచాయతీ సర్పంచులతో పాటు వార్డు సభ్యుల గడువు కాలం పూర్తి అయ్యాయి.కాగా నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లబోతుంది.గడిచిన ఐదు సంవత్సరాలలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయో లేదో వేచి చూడాలి మరి...వనపర్తి జిల్లాలో 250 గ్రామపంచాయతీలు ఉన్నాయి.ఇకనుండి ఈ రెండు వందల యాభై గ్రామపంచాయతీలలో ప్రధానంగా త్రాగునీరు మురుగు కాలువల శుభ్రత,నిర్మాణం తో పాటు వీధి లైట్లు సిసి రోడ్లు పారిశుద్ధ్యం ప్రధాన సమస్యలు సర్పంచులు ఈ గడిచిన ఐదు సంవత్సరాలలో సర్పంచులు వారికి తోచిన విధంగా పనులను చేపట్టి మామ అనిపించారు.కొందరు సర్పంచులు ఆర్థిక స్తోమత లేకపోవడంతో పనులను చేసేందుకు జంకారు.తద్వారా పంచాయతీలలో నెలకొన్న సమస్యలు తిష్ట వేశాయి.ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న సర్పంచులు.వనపర్తి జిల్లాలో 250 గ్రామపంచాయతీలకు గాను 250 సర్పంచులు తమ యొక్క గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయాలన్న కృత నిశ్చయంతో పనులను చేపట్టి పూర్తి చేశారు.కానీ వాటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కొంతమంది సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులు చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్న సంకల్పంతో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు.కానీ చేసిన పనులను కొన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచులకు బిల్లులు రాక నానా అగుచాట్లు పడుతున్నారని తెలుస్తుంది.



**నేటి నుండి పంచాయితీల తీరు మారేనా.....?**

జిల్లాలోని గ్రామపంచాయతీలలో పరిష్కారం కాని సమస్యలను ప్రత్యేక అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.ప్రత్యేక అధికారులు గ్రామాలలో పర్యటించి మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచుతూ మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తూ వీధిలైట్లు ఏర్పాటుతోపాటు సిసి రోడ్ల నిర్మాణాలు గ్రామాలలో లోపించిన పారిశుద్ధ్యం మెరుగుపరచి ప్రజలకు రోగాలు రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లాలో ఎంతైనా ఉంది.

**అధికారుల చొరవతో గ్రామపంచాయతీ సమస్యలు పరిష్కరిస్తాం:డిపిఓ సురేష్ కుమార్**

జిల్లాలోని 250 గ్రామపంచాయతీలకు నేటి నుంచి ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుంది.గ్రామాలలో నెలకొన్న సమస్యలను అధికారుల ద్వారా తెలుసుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాము.

## సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నా ఎంపికైన స్టాఫ్ నర్సులు



**వనపర్తి టౌన్,జనవరి 31,ప్రభాతవార్త :** జిల్లా నుంచి కొత్తగా స్టాఫ్ నర్సులుగా ఎంపికైన అభ్య ర్థులు నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు.ఇందుకోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక బస్సుల్లో వారఉ బయలుదేరారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం నుండి ఈ బస్సులకు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి జెండా ఊపి సాగనంపారు.జిల్లా నుంచి మొత్తం 99 మంది పరీక్షల్లో ఎంపిక కాగా,అందులో 67 మంది బస్సుల్లో బయలు దేరినట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు.మిగిలిన వారు స్వతహాగా వస్తున్నట్లు తెలిపారు.వీరంతా నేడు హైదరాబాద్ అందుకోనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చా రెడ్డి,మాజీ జడ్పిటీసీ వెంకటయ్య,డిఎంహెచ్వో జయ చంద్ర మోహన్, డిప్యూటీ డీఎం హెచ్వో శ్రీనివాసులు,శ్రీనివాసులు,ఏఓ డాక్టర్ సాయినాథ్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## విప్లవ వీరుడు ప్రజా గద్దర్ జయంతి వేడుకలు..

**పెబ్బేరు,జనవరి 31,ప్రభాతవార్త :** విప్లవ వీ రుగు,ప్రజా యుద్ద నౌక గద్దర్ జయంతి వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్బంగా వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ జ్వాలాలను ప్రేరేపించి ప్రత్యేక రాష్ట్ర పోరాటం వైపు నడిపించడంలో ఆయన పాత్ర ప్రత్యేకమన్నారు.తన పాటలతో సకల జనులు పదం పడుతూ కదం తొక్కుతూ పోరాటాలను ఉధృతం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో కీలక భూమిక పోషించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట రాములు,మండల అధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్,సురేందర్ గౌడ్,గంధం రాజు,యువ నాయకులు రంజిత్,దయాకర్ రెడ్డి,గంధం సునీల్, గంధం వినయ్,సత్యనారాయణ రెడ్డి,రాములు,జ్వంగిర్,సాయి తేజ గౌడ్,హేమంత్,గంధం అంజి, అనిల్,శివ,గణేష్,మహేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా పోలీస్ శాఖలో బదిలీలు..

**వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) గా నాగభూషణ రావు**

**పట్టణ ఎస్సైలు గా జయన్న,నాగన్న రూరల్ ఎస్సై గా పి.జలంధర్ రెడ్డి నియమితులు అయ్యారు**



**వనపర్తి టౌన్,జనవరి 31,ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీకి పుష్పగుచ్చం అందజేసి బాధ్యతలు స్వీకరించిన సీఐ,రాష్ట్రంలో సాధారణ బదిలీలలో వనపర్తి సిఐ మహేశ్వరరావు బదిలీకావడంతో వనపర్తికి కొత్త సీఐగా బదిలీ పై దేవరకొండ నుండి వనపర్తికి సీఐగా రావడం జరిగింది.ఈసందర్భంగా జిల్లా ఎస్పి రక్షిత కె మూర్తి,మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చం అందజేసి కలిశారు.వనపర్తి సిఐగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సమస్య పరిష్కరించే దిశగా హామీ ఇస్తూ బాధితులకు ధైర్యాన్ని కల్పిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు.ఎటువంటి పెండెన్సీ లేకుండా చూడాలని,త్వరితగదగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులను పూర్తి చేయాలని సూచించారు.

## ప్రజాసేవ అదృష్టంగా భావిస్తా..



**అమరచింత,జనవరి 31,ప్రభాతవార్త :** ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తానని కృష్ణంపల్లి గ్రామ సర్పంచ్ చెన్నమ్మ కురుమన్న అన్నారు.బుధవారం అమరచింత మండల పరిధిలోని కృష్ణంపల్లి గ్రామ సర్పంచ్ చెన్నమ్మ కురుమన్న పదవీకాలం ముగియడంతో గ్రామ యువకులు,పెద్దలు సర్పంచు చెన్నమ్మ కురుమన్నను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్బంగా మాట్లాడుతూ,గత ఐదు సంవత్సరాల పదవీకాలంలో గ్రామ అభివృద్ధికి కృషి చేశామని గ్రామంలో పాఠశాల భవనం,నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేశామని,అలాగే గ్రామంలో రోజు పారిశుద్ధ పనులు నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచానని ఆయన అన్నారు.గ్రామ అభివృద్ధికి గత ఐదు సంవత్సరాలుగా సహకరించిన వివిధ పార్టీల నాయకులకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. మల్లారెడ్డి,రాజు,ముకుంద,సుధాకర్,వెంకటన్న తదితరులు ఉన్నారు.

## గ్రామ అభివృద్ధిలో సర్పంచులు పాలుపంచుకోవాలి డిపిఓ



**ఖిల్లా ఘనపురం,జనవరి 31,ప్రభాతవార్త :** గ్రామ అభివృద్ధి పనులలో పదవీ విరమణ పొందిన సర్పంచులు పాలుపంచుకుని గ్రామ అభివృద్ధికి సహకరించాలని డిపిఓ సురేష్ అన్నారు.షాపురం గ్రామంలో బుధవారం సర్పంచ్ బాల ఆంజనేయులుతో పాటు పంచాయతీ కార్యదర్శి రవి పంచాయతీ సిబ్బందికి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు గ్రామంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అభినందించారు.పదవిలో లేకపోయినా సేవా కార్యక్రమంలో పాల్గొని గ్రామభివృద్ధితో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని డిపిఓ అన్నారు. అనంతరం సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్ ఎంపీ ఓ రాము ఏపీఓ తో పాటు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ఖిల్లా ఘణపురం,జనవరి 31,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. బుధవారం గట్టుకడుపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం 15లక్షలతో నిర్మించిన నూతన కళ్యాణమండపం అదేవిధంగా రుక్కన్నపల్లిగ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా మండలి భవనంతో పాటు నర్సరీని ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గత పదిఏళ్ల కాలంలో రాష్ట్రం ఎంతో వెనకబడిపోయిందని ఇందిరమ్మరాజ్యంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వపథకాలను అందజేస్తామ న్నారు. మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మూడుకోట్ల యాబై లక్షలకు పైగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు.ఎంపీపీ కృష్ణా నాయక్ జడ్పిటిసి సామ్యా నాయక్ సర్పంచులు దేవేందర్ నరేష్ నాయక్ మాజీ ఎంపీపీ వెంకటయ్య వెంకట్రావు మాజీ సింగిల్ విండో చైర్మన్ రవీందర్ రెడ్డిలు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభ కరపత్రం ఆవిష్కరణ



**కల్వకుర్తి, జనవరి 31 ప్రభాతవార్త:** ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభ కరపత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనం ద్కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 26న కల్వకుర్తి పట్టణంలోని పార్థసారథి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు సంస్మరణసభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సభ అధ్యక్షులు పర్వపాకుల శేఖర్ పేర్కొన్నారు. సంస్మరణ సభకు కల్వకుర్తి మండలంతో పాటు ఆయా మండలాల నుంచి ప్రజానీకం అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గోపాల్, సైదులుయాదవ్, మాలిక్, అబ్దుల్, చంద్రకాంత్‌రెడ్డి, కరణ్, జాన్సీ, లలిత, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## వాల్ నిర్మాణం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**ధరూర్ జనవరి 31 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల జూనియర్ కాలేజీ నిర్మాణం అవుతున్న కాంపౌండ్ వాల్ ప్రహారీ గోడను, కమిటీ హాల్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించడం జరిగింది. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

# సమన్వయంతో పనిచేయాలి.. కౌన్సిల్‌కు మంచి పేరు తేవాలి..!!

**- భూత్పూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్**

**- పెండింగ్ బిల్లుల చెల్లింపుల జాప్యంపై కౌన్సిలర్ల ఆగ్రహం..**



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

**భూత్పూర్,జనవరి31,ప్రభాతవార్త:** అధికారులు,సిబ్బంది ప్రజాప్రతినిధులతో సమన్వయంగా కలిసి పనిచేస్తూ కౌన్సిల్‌కు మంచిపేరు తేవాలని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు.బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ పరిధిలోని వార్డులలో అభివృద్ధి పనుల పట్ల దృష్టిని సారించాలని సూచించారు.ముఖ్యంగా రోడ్లు,తాగునీటి సరఫరా,డ్రైనేజీలు,శ్మశానవాటికల నిర్మాణాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.స్కూల్ బిల్డింగ్ ప్రహరీలు,రోడ్లు,పైప్ లైన్లు,డ్రైనేజీల నిర్మాణాల బిల్లులు సకాలంలో అందడంలేదని పలువురు కౌన్సిలర్లు వర్క్స్ ఇన్స్పెక్టర్,ఏఈ ఇతర పంచాయతీరాజ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఐదో వార్డు కౌన్సిలర్,రామకృష్ణ,ఆరో వార్డు కౌన్సిలర్,కోఆప్షన్ సభ్యుడు అజీజ్ అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన బిల్లులు మున్సిపాలిటీ ఎందుకు చెల్లించాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్,మూడో వార్డు కౌన్సిలర్ తూము శ్రీనివాస్‌రెడ్డి కౌన్సిల్‌లో ప్రశ్నించారు.ప్రజాపాలన ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా పార్టీ పరంగా ఉన్నట్లుందని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు.ప్రొటోకాల్ లేకుండా స్థానిక కౌన్సిలర్లకు సమాచారం లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులే ఆసీనులై అభ్యర్థనలు స్వీకరించారని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.చైర్మన్,వైస్ చైర్మన్లు కల్పించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక కౌన్సిలర్లను ప్రజాపాలనలో భాగస్వాముల్ని చేయాల్సిన అవసరముందని తెలిపారు.ప్రతి గ్రామంలో హైమాస్ట్ లైట్లనేర్పాటు చేయాలని పలువురు కౌన్సిలర్లు చైర్మన్,కమిషనర్,మేనేజర్,ఏఈ దృష్టికి తెచ్చారు.మొత్తం మీద బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగిందనే చెప్పాలి.సమావేశానికి వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాస్,కమిషనర్ నూరుల్ నజీబ్,మేనేజర్ అశోక్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లు నాగమ్మ,శశికళ,కోఆప్షన్ సభ్యుడు జాకీర్ ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెబ్బేరు,జనవరి 31,ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసనికి,శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు.శ్రీ చౌదేశ్వరి దేవి ఉత్సవాల సందర్భంగా పెబ్బేరు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన క్రికెట్ క్రీడలను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక,మానసిక దృఢత్వాన్ని,పోటీతత్వాన్ని,ఓర్పును,ఏకాగ్రతను పెంపొందించి ఆలసటను తొలగిస్తాయని తెలిపారు.క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోని ముందుకు సాగాలన్నారు. మంచి నైపుణ్యత కలిగిన క్రీడాకారులు రాష్ట్ర,జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సైతం గుర్తింపు లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు,మండల అధ్యక్షుడు విజ యవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్,నాయకులు సురేందర్ గౌడ్, రంజిత్,దయాకర్ రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి,గంధం రాజు, భాను ప్రకాష్ రెడ్డి,సాయి తేజ గౌడ్,సత్యనారాయణ రెడ్డి,శివ హేమంత్,గణేష్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన పాలిటెక్నిక్ కళాశాల అధ్యపక బృందం

**ఎమ్మెల్యే మేఘా రెడ్డిని కలిసిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల బృందం**

పెబ్బేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.కె శ్రీకాంత్ ఆధ్వర్యంలో కళాశాల బృందం బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కళాశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.కళాశాలలో నూతరంగా ప్రారంభించబోయే వసతి గృహంలో మౌళిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.కళాశాల అభివృద్ధి కొరకు పూర్తి ప్రతిపాదనలను ఎమ్మెల్యేకు అందజేశారు.కళాశాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యపక బృందం గంధం రంగస్వామి,కేతావత్ దశరథ నాయక్ ఉన్నారు.

## నూతన పాఠశాల భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ధరూర్ మండల వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

**ధరూర్ జనవరి 31 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఓబులోనిపల్లి గ్రామంలో నూతన పాఠశాల భవనాన్ని సర్పంచు పరుషరాముడు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ధరూర్ మండల వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పిస్తుందని కాబట్టి విద్యార్థులందరూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు పాఠశాలకు గ్రామానికి ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని మీకు నా సహయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు, ఉపసర్పంచు, వార్డు మెంబర్లు, మాజీ ఎంపీటీసీ చిన్న నాగన్న, మహేష్, తిమ్మప్ప, గ్రామపెద్దలు ,యువకులు, స్కూల్ చైర్మన్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

**నూతన కాలువ వంతెన (బ్రిడ్జి) ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ధరూర్ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి**



కాలువ వంతెన బిడ్జిని ప్రారంబిస్తున్న ఎంపిపి

మండల పరిధిలోని ర్యాలంపాడు గ్రామంలో నూతన కాలువపై వంతెన బ్రిడ్జను సర్పంచు కర్రెమ్మ ప్రారంభించారు. కార్యక్రమానికి ధరూర్ మండల వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమ పంట పొలాలకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి మనస్థానిక శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సహకారంతో ఈ వంతెన నిర్మాణం చేయడం జరిగిందని అదే విధంగా గ్రామానికి సంబంధించి ఎల్లప్పుడూ గ్రామ అభివృద్ధికి సహయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు చిట్టెం వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచులు అంపన్న, దౌలన్న, ధరూర్ మండల యూత్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, రంగారెడ్డి, లక్ష్మన్న, రంగన్న గౌడ్, నాగన్న, సురేష్, తిమ్మప్ప, మద్దిలేటి, నరసింహులు, వెంకటేశ్, వార్డు మెంబర్‌లు గ్రామ పెద్దలు,యువకులు, రైతులు తదితరులు ఉన్నారు.

## క్రీడలను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్

**పెబ్బేరు,జనవరి 31,ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న పిపిఎల్ 14 ఎడిషన్ క్రీడలను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్ ప్రారంభించారు.పూజాకార్యక్రమాలు నిర్వహించి.క్రికెట్ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెబ్బేరు పట్టణంలో క్రీడాకారులను దృష్టిలో ఉంచుకొని పెబ్బేరు పట్టణానికి మినీ స్టేడియం నిర్మాణకోసం 10ఎకరాల భూమిని కేటాయించి,సుందరంగా తీర్చిదిద్దామన్నారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్క క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి ఈ పిపిఎల్ 14ఎడిషన్ విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి,మాజీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మంగరాయి శ్యామల మన్యం, సహదేవుడు,మేకల ఎల్లయ్య,సాయినాథ్,వనం రాములు,జగన్నాథం నాయుడు,ఎల్లస్వామి,ముస్తాక్,కేతన్,డాక్టర్ రఘు,హనుమాన్ యూత్ సభ్యులు,ఆజాద్ సభ్యులు,ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ సాయినాథ్

## బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..

**పెద్దమందడి,జనవరి 31,ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైనార్టీ పాఠశాలలో బాలల హక్కులు,వారి రక్షణ చట్టాలపై విద్యార్థులకు చైల్డ్ లైన్ కేస్ వర్కర్ రవిరాజు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బాల బాలికలు తప్పనిసరిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.చైల్డ్ మ్యారేజ్ ఆక్ట్ 2006 ప్రకారం బాల్య వివాహం చేయడం నేరమని ప్రోత్సహించిన వారికి 2 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.చైల్డ్ లేబర్ గా 18 సంవత్సరాలలోపు పిల్లలు పని చేయకూడదని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా భేటీ బచావో భేటీ పడావో నినాదంతో పిల్లలను రక్షిద్దాం పిల్లలను చదివిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించి,ఆడపిల్లలపై వివక్షత చూపరాదని తెలిపారు.



చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



## ఖిల్లాలో ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు..



**ఖిల్లా ఘణపురం,జనవరి31,ప్రభాతవార్త :** పల్లె పల్లెల్లో ప్రజానీకాన్ని తన ఆటపాటలతో చైతన్యం చేసిన మహావీరుడు గద్దరని కమ్మరి గోపి అన్నారు.బుధవారం గద్దం జయంతి వేడుకలను మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రఏర్పాటులో సైతం తనబృందం ఆటపా టలతో పల్లె పల్లెలో తెలంగాణ ఏర్పాటు కొరకై సమావేశాలు నిర్వహించారని చెప్పారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు భూమయ్య దేవిజా నాయక్ పల్నాటి శ్రీనివాసులు బాలరాజు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**ధరూర్ జనవరి 31 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పి.రాములు భార్య సుజాత అనారోగ్యంతో బాధపడుతున్న మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వారి స్వగృహం చేరుకుని ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పిటిసి రాజశేఖర్, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డి.వై.రామన్న తదితరులు ఉన్నారు.

## నారాయణపేట ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు



**నారాయణపేట ప్రతినిధి,జనవరి 31 ప్రభాతవార్త :** నారాయణ పేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై నారాయణపేట ఎస్‌హెచ్‌ఓగా వచ్చారు.ఇంతకు ముందు నారాయణపేట ఎస్సైగా ఉన్న విజయ్‌కుమార్ మహబూబ్‌నగర్‌రూరల్ పోలీస్ స్టేషన్‌ను బదిలీ అయ్యారు.ఈసందర్భంగా నూతన ఎస్సై ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలందరికి అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సమన్వయం అందిస్తూ,సమస్యలు పరిష్కరిస్తూ,శాంతి భద్రతల పరిరక్షించడానికి కృషి చేస్తానని అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరిత్యా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

## ధరణి గ్రూప్ ఆఫ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 31 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ధరణిగ్రూప్ ఆఫ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీలో 100 పోస్టుల ఉద్యోగాల కోసం నారాయణపేట జిల్లాలోని డిఆర్‌డిఎ ట్రైనింగ్, స్కిల్ సెంటర్‌లో ఫిబ్రవరి 3న ఉదయం 10.30 గం.ల నుంచి 1.30 గం.ల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ ధరణి గ్రూప్ ఆఫ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో నెలకు రూ. 25 వేల వేతనం ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అలాగే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లీడర్స్ పోస్టులకు గాను పదో తరగతి ఆపై అర్హత కలిగి ఉన్న 18 సంవత్సరాలు పైబడిన యువకులు నేరుగా తమ సర్టిఫికెట్లతో నారాయణపేటలోని డిఆర్‌డిఎ ట్రైనింగ్, స్కిల్ సెంటర్‌కు హాజరు కావాలని, ఈ పోస్టులకు ఎలాంటి అనుభవం అవసరం లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇతర వివరాలకు 9392121201 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి...



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 31 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలం పుల్జాల్ గ్రామంలో మామిళ్ల అడివయ్య మంగళవారం సాయంత్రం పుల్జాల్ గ్రామంలో ఉన్న డ్యాంలో చేపలు పట్టుటకు వెళ్లి ప్రమాదవశాత్తు వల కాలుకు చుట్టుకొని నీటిలో మునిగిపోయాడు. వ్యక్తి నీటిలో మునిగిపోవడంతో గాలింపు చర్యలు చేపట్టిన దొరకలేదు. బుధవారం ఉదయం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో డ్యాంలో గాలింపు చర్యలు చేపట్టి ఉదయం 11గంటలకు శవాన్ని బయటకు వెలికి తీశారు. మృతదేహన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## సర్పంచ్‌లను సన్మానించిన మంత్రి జూపల్లి



**కొల్లాపూర్, జనవరి 31 ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు అందించిన సేవలు అమో ఘమని వారి సేవలకు వెల కట్టలేమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్‌ల పదవికాలం ముగుస్తుండడంతో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లకు మండల కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండల ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటిసి మేకల గౌరమ్మ వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## స్మృతివనంలో సౌకర్యాలు కల్పించేందుకు కృషి..

**స్మృతివనాన్ని పరిశీలించిన కలెక్టర్ బిఎం సంతోష్**



**గద్వాల ప్రతినిధి, జనవరి 31 ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని స్మృతివనం అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. బుధవారం రాత్రి గద్వాల పట్టణంలోని రాజీవ్ మార్గంలో గల స్మృతి వనంలో అన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సీనియర్ సిటిజన్ ఫోరం వాకర్స్ కమిటి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించగా జిల్లా కలెక్టర్ ఈ మేకు స్మృతివనాన్ని పరిశీలించారు. స్మృతి వనంలో వాకర్స్ కొరకు లైటింగ్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇంకా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేశ్వర్లు, డిఇ సందీప్, కౌన్సిలర్ మాధవి, సంబం ధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవలందించిన వారిని ఎప్పుడూ మరువరు..



**ఉప్పునుంతల, జనవరి 31 ప్రభాతవార్త :** ప్రజలకు అందుబాటులో ఉండి అనునిత్యం సేవలందించిన వారిని ఎప్పుడు మరిచిపోరని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఎంపిపి అరుణ నరసింహారెడ్డి పదవి కాలం ముగుస్తున్న సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎంపిపి అరుణ నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ గ్రామాలలో సర్పంచ్‌లు అనునిత్యం ప్రజల మధ్యలో ఉండి సేవలు చేసిన వారు ఎప్పుడు మదిలో ఉంటారని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వారిని హృదయంలో ఉంచుకుంటారన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ,ఎంపిపి అరుణ నరసింహారెడ్డి, జడ్పీటిసి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బాలునాయక్, ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు, తిప్పర్తి నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, కాల్వ గోవర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎంపిటిసిలు రెడ్డి రెడ్డి రంగారెడ్డి, సంబు భాస్కర్, గోపిరెడ్డి అనురాధ, శ్యామలీల, ఇటిక్యాల కవిత తిరుపతిరెడ్డి, అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లకు ఘన సన్మానం..



**రాజాపూర్, జనవరి 31 ప్రభాతవార్త :** గత ఐదు సంవత్సరాలుగా రాజాపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లుగా ఎన్నికై గ్రామాలను అభివృద్ధి సంక్షేమం వైపు తీసుకెళ్లిన సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో బుధవారం రాజాపూర్ గ్రామ సచివాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌ను రాజాపూర్ ఎంపిపి సుశీల రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు పటిష్టంగా ఉన్నప్పుడే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధి వైపు పయనిస్తాయని అన్నారు. అంతకు ముందు వివిధ గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ గ్రామాల అభివృద్ధికి సహకరించిన పాలకవర్గానికి, ఓటువేసి గెలిపించిన ఆయా గ్రామాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపిపి సుశీల రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపిపి నర్సింలు, ఎంపిడిఓ లక్ష్మీదేవి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కొప్పెరి బచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల గంగాధర్‌గౌడ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రథమ పౌరులుగా మంచి పేరు తెచ్చుకున్నారు



**బిజినేపల్లి, జనవరి 31 ప్రభాతవార్త :** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రథమ పౌరులుగా మంచి పేరు తెచ్చుకున్నారని ఎంపిపి పుప్పాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అన్ని గ్రామాల సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం ఏదో ఒక సమస్య ప్రజలను వేదిస్తుంటుంది. ఆసమస్య పరిష్కారానికి గ్రామ సర్పంచ్‌లు రాత్రి పగలు తేడా లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం ముందున్నారని అభినందించారు. అనంతరం సర్పంచ్‌లను శాలువాలు, పూల మాలో సత్కరించారు. సమావేశంలో ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు మంగి విజయ్, ఎంపిఈఓ రాములునాయక్, అన్ని గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు సన్మానం



**లింగాల, జనవరి 31 ప్రభాతవార్త :** సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యుల పదవీకాలం ముగింపు సందర్భంగా మండల పరిధిలోని కోమటికుంట గ్రామ పంచాయతీ పాలకవర్గానికి బుధవారం వీడ్కోలు పలికారు. పాలకవర్గానికి సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదాబాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం అంజిలాల్, విజయ్, పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా లింగాల మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కోనేటి తిరుపతయ్య వార్డు సభ్యులకు, మాజీ జడ్పీటిసి మాకం తిరుపతయ్య,సీనియర్ నాయకులు కెటి తిరుపతయ్య పూలమాలలతో సత్కరించారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రానోజీ, సింగిల్‌వైస్ చైర్మన్ వెంకటగిరి, మల్లేష్, ప్రేమ్‌కుమార్, మాజీ వార్డు సభ్యులు గుడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలి:మంత్రి జూపల్లి



**కొల్లాపూర్, జనవరి 31 ప్రభాతవార్త :** భక్తుల కోరికలు తీర్చే నాయినపల్లి మైసమ్మ దేవతను దర్శించు కునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా చూడాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మైసమ్మ దేవాలయ అభివృద్ధి కమిటి, అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలంలోని నాయనిపల్లి మైసమ్మ దేవతను మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మైసమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటి చైర్మన్‌గా నియమితులైన బుడుగు శ్రీనివాస్‌ను మంత్రి శాలు వాతో సన్మానించారు. అలాగే దేవస్థానం కమిటివారు మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానించారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండల ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటిసి మేకల గౌరమ్మ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు డా. పగిడాల శ్రీనివాస్, దేవల్ తిర్మలాపూర్ సర్పంచ్ సత్యం, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది..

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



**చిన్నంబావి, జనవరి 31 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గడ్డ బస్వాపురం, బెక్కెం గ్రామాలలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ప్రారంభించారు. చిన్నంబావి మండలం బెక్కెం గ్రామం, గడ్డబస్వాపురం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భనవాలు మంత్రి ప్రారంభించారు.ఆయా గ్రామాల సర్పంచ్‌లకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా



మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సంక్షేమం కొరకు ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, కొల్లాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలలో ప్రజా అవసరాల కోసం భవనాలను నిర్మించి గ్రామాల సమగ్ర అభివృద్ధి కొరకు పాటుపడతానని మంత్రి అన్నారు. కార్యక్రమంలో చిన్నంబావి మండల ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# నూతన పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**ధరూర్ జనవరి 31 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామంలో నూతన మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే దంపతులు బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే సర్పంచు బండ్లజ్యోతి కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే సర్పంచు బండ్ల జ్యోతి, గ్రామస్తులు, విద్యార్థులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. బూరెడ్డిపల్లి గ్రామాలలో పాఠశాలల నూతన భవనం ఎమ్మెల్యే, గ్రామస్తులు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. అదే విధంగా చెన్నారెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, సర్పంచు బండ్లజ్యోతి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యే దంపతులకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. గ్రామంలోని మహిళలకు గ్రామ సర్పంచు చీరలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయడం జరిగింది. ప్రతి గ్రామంలో పిల్లలు చదువుకోవాలని ముఖ్య ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో కూడా కొన్ని పాఠశాలలో ఎంపిక చేసి వాటిలో అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలలో వైకుంఠధామం, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, పాఠశాల, అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకోవడం జరిగిందని గ్రామ అభివృద్ధికి తోడ్పాటు జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. సర్పంచు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో అన్ని రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ అదే విధంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గత రాష్ట్రము ప్రభుత్వము ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామంలో నిర్వహించుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు అందిస్తూ అదే విధంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గత రాష్ట్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గ్రామంలో నిర్వహించుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగింది. అదే విధంగా సీసీ రోడ్లను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. డంపింగ్ యార్డు, వైకుంఠధామం, ప్రకృతి వనం, అనేక అభివృద్ధి గ్రామంలో గ్రామ ప్రజలందరికి సహకారంతో పూర్తి చేసుకోవడంజరిగిందని తెలిపారు. నా వంతు గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పడుతుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పద్మా వెంకటేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఉపసర్పంచు రంగస్వామి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు విజయ్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి, మహేశ్ రెడ్డి, శంకర్ రెడ్డి, మహిళా నాయకురాలు రాధా మధుమతి, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లాలో ముగిసిన జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్స్

**-గెలుపొందిన క్రీడా పోలీస్ అధికారులకు బహుమతులు అందించిన మంత్రివర్యులు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 31 ప్రభాతవార్త:**మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు పోలీసులను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర అబ్కారీ సాంస్కృతిక పర్యాటక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండానికి వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి కనీస వ్యాయామం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. దీనికి పోలీస్ అధికారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉంటే మెదడు బాగా పని చేస్తుందని తద్వారా మంచి విజయాలు సాధించవచ్చునని తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, సైనికులు ప్రతి నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉంటారని అకుంఠిత కార్యదీక్ష వల్ల ఎక్కడ సమస్య ఉన్న వెంటనే చేరుకొని పరిష్కరి




మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్

స్తారని కొనియాడారు. ఒక్క పోలీస్ శాఖ మాత్రమే కాకుండా ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ప్రతి ఒక్కరు వ్యాయామం, ఆటల పోటీల్లో పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

జిల్లా విద్యా, వైద్యానికి ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం ఇదే తొలిసారి అని, అందుకు జిల్లా ఎస్పీను అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాబోవు రోజుల్లో ఇతర శాఖల సిబ్బంది క్రీడల్లో భాగస్వాములయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్పోర్ట్స్ మీట్ సందర్భంఅ పాలు పంచుకున్న పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్‌రావు, డీఎస్పీ మోహన్‌కుమార్, సీఐ విష్ణు వర్ధన్‌రెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికులు పాత్ర కీలకం

**పారిశుద్ధ కార్మికులకు ఘన సన్మానంలో పాల్గొన్న జడ్పీచైర్మన్ సరిత మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్**



**ఇటిక్యాల జనవరి31 ప్రభాతవార్త:**మండల పరిధిలోని ధర్మవరం గ్రామపంచాయితీలో సర్పంచుకు అన్ని విధాలుగా ఐదేళ్లపాటు గ్రామస్థా యి అన్ని శాఖల ఉద్యోగాలు, పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు మరువలేనివని జడ్పీచైర్మన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వారిని అభినందించారు. బుధవారం మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో సర్పంచు మధునాయుడు, ఐదేళ్ల పదవికాలం రేపటితో ముగుస్తుండగా గ్రామంలో తనతో పాటు కిందిస్థాయి అన్ని శాఖల ఉద్యోగులు పారిశుద్ధ్య కార్మికులు ప్రజలకు అన్ని రకాల సేవలు అందించడంతో పాటు గ్రామ అభివృద్ధిలో వారి పాత్ర ఉండటంతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీచైర్మన్ సరిత ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు మధునాయుడు గ్రామంలోని అన్ని శాఖల ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులను టీచర్ మెన్ సరిత అలంపురు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి మహిళా ఉద్యోగులకు చీరలను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం గ్రామంలో గ్రామ సర్పంచు మధునాయుడుతో ఐదేళ్ల పాటు కలిసి గ్రామ అభివృద్ధిలో కీలకంగా అన్ని శాఖల కిందిస్థాయి ఉద్యోగులు పనిచేశారని వారిందరిని చైర్మన్ సరిత మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు మధునాయుడు, ఉపసర్పంచు మునిగౌడ్, గద్వాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు, ఎర్రవల్లి ఎంపిటిసి లక్ష్మీ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, ఎర్రవల్లి సర్పంచు జోగుల రవి, పోతురాజు సోమనాద్రి, యువరాజు, ఈదన్న నాయుడు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు రాధా, బజారన్న ,రుక్మానందరెడ్డి, గ్రామ నాయకులు, తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన దిగుబడితో మేలైన గిట్టుబాటు ధర..




మాట్లాడుతున్న పరిశోధన సంచాలకులు డా. రఘురాంరెడ్డి

**బిజినేపల్లి, జనవరి31 ప్రభాతవార్త:**వేరుశనగ పంటసాగు చేసే రైతన్న నాణ్యమైన విత్తనాన్ని ఎంచుకుని మేలైన దిగుబడితో గిట్టుబాటు ధర పొందాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా.పి. రఘురాంరెడ్డి కోరారు. పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం వేరుశనగ రైతులు, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలతో ఎగుమతి దారులు సమావేశం నిర్వహించారు. డా.పి. రఘురాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగ పంటను రైతులు పండిస్తున్నారని చెప్పారు. వేరుశనగ పంటను శుద్ధి చేసుకోవడం సరైన యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. నాణ్యమైన దిగుబడులను పండించిన రైతులపంటను భవిష్యత్తులో విదేశాలకు సైతం ఎగుమతి చేసే అవకాశం లేకపోలేదని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. వి.సుధారాణి మాట్లాడుతూ వేరుశనగ పంటలో నాణ్యమైన విత్తనం పొందాలంటే రైతులు క్షేత్రస్థాయిలో విత్తన ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. పాలెం ఎడిఆర్ డా. ఎం. మల్లారెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు ఎగుమతి దారుల సలహాలు, సూచనలు పాటించి రైతన్న వేరుశనగ పంటలో మేలైన పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొంది రైతులుతమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలని సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త డా.ఎస్. వాణిశ్రీ మాట్లాడుతూ వేరుశనగ పంటలో ఎంచుకోవాల్సిన రకాలను అధిక దిగుబడులు పొందేందుకు చేపట్టాల్సిన మేలైన పంట యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. ఐఓపిఈపిసి కిఓక్ తావా మాట్లాడుతూ వేరుశనగ ఎగుమతుల ద్వారా రైతులు ఎక్కువ ఆదాయాన్ని పొందాలంటే నాణ్యతా ప్రమాణాలు పాటించి ఎగుమతుల్లో ఎక్కువ లాభాన్ని ఆర్జివచ్చని అన్నారు. వేరుశనగ ప్రధాన శాస్త్రవేత్త డా. సూదిని హరికిషన్ మాట్లాడుతూ వేరుశనగ పంటను నిల్వచేసే యాజమాన్య పద్ధతులు ఎక్కువకాలం నిల్వచేసే పిక్స్ బ్యాగ్ వివరాలను తెలియజేశారు. సమావేశంలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పిజెటిఎస్ఏయు శాస్త్రవేత్తలు పిజెటిఎస్ఏయు అధికారులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారులు, నూనెగింజల మిల్లర్లు, సంస్థల ప్రతినిధులు, ఎన్జీఓ ఆర్గనైజ్ కార్యక్తలు పాల్గొన్నారు.

# నూతన పంచాయతీ భవనంతో సేవలు సులభం..

**డిసిసిబి డైరెక్టర్,మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి,సర్పంచ్ అనిత**

**పాన్‌గల్, జనవరి 31,ప్రభాతవార్త :** ప్రజల అవసరార్థం వారి సౌలభ్యం కోసమే నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మించడం జరిగిందని డిసిసిబి డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి సర్పంచ్ మామిళ్ళపల్లి అనిత లు అన్నారు.బుధవారం మండల పరిధిలోని కేతేపల్లి గ్రామంలో రూ.13 లక్షల రూపాయలతో నిర్మించిన నూతనగ్రామపంచాయతీ భవనాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేలా సర్పంచ్ అధికారులు పాలన అందించేందుకు ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం నూతన భవనాల మంజూరు చేయడం జరిగిందన్నారు.అందులో భాగంగానే గ్రామానికి నూతన భవనం మంజూరు కావడం హర్షణీయమన్నారు.అనంతరం సర్పంచ్ వార్డు సభ్యులు పదవీ కాలం నేటితో ముగియనున్నడంతో డిసిసిబి డైరెక్టర్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి గ్రామస్తులు సర్పంచు ఉప సర్పంచ్ వార్డు సభ్యులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తలకంటి శ్యామల పంచాయతీ కార్యదర్శి హరిత మాజీ సర్పంచులు కళావతమ్మ ఉషన్న చెన్నయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిసిసిబి డైరెక్టర్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి సర్పంచ్ అనిత

# సర్పంచ్‌లకు ఘన వీడ్కోలు పలికిన పంచాయతీ కార్యదర్శులు



సర్పంచ్‌లను సన్మానించిన దృశ్యం

**బాలానగర్, జనవరి 31 ప్రభాతవార్త :** గత పదేళ్లుగా సర్పంచ్‌లు గ్రామాలలో అందించిన సేవలు ఎనలేనివని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌ల సేవలను కొనియాడారు. బుధవారం ఈమేరకు బాలానగర్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో వీడ్కోలు సమావేశాన్ని పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ, ఎంపిఓ ఇతర ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ ప్రథమ పౌరులుగా ఐదేళ్లుగా విధులు నిర్వహించిన సర్పంచ్‌లు, వారి వారి గ్రామాల అభివృద్ధి కోసం పని చేశారని కొనియాడారు. ప్రజలు తమకు అందించిన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించి, అనేక అభివృద్ధి కార్యక్రమాలలో పాటు పంచుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు దిగిపోక తప్పదని, ప్రజల మన్ననలను పొందిన నాయకులు ప్రజల సేవలో పాలుపంచుకోవడం ఒక అదృష్టంగా భావించాల్సి ఉంటుందని, అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, మండల అధికారులు, అన్నిగ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యలో నంబర్ వన్‌గా నిలుపుతాం..

**జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**బూరుగుపల్లిలో అదనపు తరగతి గదులు ప్రారంభం**



**జడ్చర్ల, జనవరి 31 ప్రభాతవార్త :** విద్యలో జడ్చర్ల ప్రాంతాన్ని మహబూబ్‌నగర్ జిల్లాను మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్యతోపాటు, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. గ్రామీణ పేద విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు ఈ ప్రాంతానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

## హైదరాబాద్ తరలిన 38 మంది స్టాఫ్ నర్సులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 31 ప్రభాతవార్త :** స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు జిల్లానుండి ఎంపికైన 308 మందితో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. కృష్ణలు బుధవారం మహబూబ్‌నగర్ నుండి హైదరాబాద్ వెళ్లారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లాలో ఎంపికైన 308 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలను అందజేయనున్నారని డిఎంహెచ్‌ఓ డా. కృష్ణ తెలిపారు. ఇందుకుగాను జిల్లా నుండి హైదరాబాద్ వెళ్లేందుకు వైద్యారోగ్యశాఖ తరపున జిల్లా యంత్రాంగం 7 బస్సులను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు.

## జాతీయ స్థాయి చిత్రలేఖన వ్యాసరచన పోటీలు

**అడ్డాకుల, జనవరి 31 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌టిపిసిహెచ్ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ శాఖ వారు జాతీయస్థాయి చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు సంస్థ తరపున కెవి అశోక్, శ్రీధర్, డ్రాయింగ్ టీచర్ భాస్కరాచారి నిర్వహణలో నిర్వహించారు. చారిత్రక కట్టడ సంపదపై చిత్రలేఖనం చేసి దానిపై 150 పదాల వ్యాసరచన రాయడం ఈ పోటీలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈపోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు వారసత్వం,మన సంస్కృతి సంప్రదాయాలు పట్ల అవగాహన పెంపొందించుకుని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతలు తెలియజేయడమే దీని ఉద్దేశం పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి ఉమాపతిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులు నాటుసారా, నల్లబెల్లం పట్టివేత

**కొల్లాపూర్, జనవరి 31 ప్రభాతవార్త :** కొల్లాపూర్ మండల పరిధిలోని ఎన్మన్‌బెట్ల తండాలో బుధవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. కొల్లాపూర్ ఎస్‌హెచ్‌ఓ అధికారులు, నాగర్‌కర్నూల్ డిటిఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో ఎన్మన్‌బెట్ల తండాలో ఆకస్మిక దాడులు జరిపి 30 లీటర్ల నాటుసారాను, సారా తయారీకి వినియోగించే 20 కేజీల నల్లబెల్లంను పట్టుకుని సీజ్ చేసినట్లు కొల్లాపూర్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఏడుకొండలు తెలియజేశారు. ఈ దాడులలో సారా తయారీకి రహస్య ప్రదేశాలలో నిల్వ ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊట పానకం గుర్తించి నేలపై పారబోసినట్లు ఇందుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ ఏడుకొండలు తెలియజేశారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివకుమార్‌రెడ్డి

**రాజాపూర్, జనవరి 31 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామానికిచెందిన కిష్టారంశివకుమార్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాసుయాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని శివకుమార్‌రెడ్డికి అందజేసినట్లు తెలిపారు.ఈసందర్భంగా మాట్లాడుతూ జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డికి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, యూత్ కాంగ్రెస్ జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షులు వంశీకి, ఈ పదవి వచ్చేందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్, యూత్ అధ్యక్షులు వెంకట్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వనపర్తి నరహరి, గోనెల రమేష్, వనపర్తి రమణ, విక్రంరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.